

## ఆశ్రమాలు, గురుకులాలకు గ్యాస్ కష్టాలు

జీసీసీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిన ఆదాయపన్నుల శాఖ

- గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపేసిన జీసీసీ
- ఇబ్బంది పడుతున్న హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు

- 8లో



## జలకళ



కొత్తపల్లి జలపాతానికి జలకళ వచ్చింది. ఏజెన్సీలో వర్షాలు కురుస్తుండడంతో జలపాతం పొంగి ప్రవహిస్తున్నది. జలపాతం నుంచి జాలువారుతున్న నీటిని చూసి పర్యాటకులు అబ్బురపడుతున్నారు. ఈ సోయగాన్ని పర్యాటకులు తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.
-జి.మాడుగుల

కొత్తపల్లి జలపాతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

## మోదకొండమ్మకు భక్తుల తాకిడి



మోదకొండమ్మను దర్శించుకొనేందుకు క్యూలో ఉన్న భక్తులు

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉదయం 7 గంటల నుంచే భక్తులు పోటెత్తారు. దీంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. -పాడేరు రూరల్

# మన్యంలో విజృంభిస్తున్న మలేరియా

**అధికంగా నమోదవుతున్న కేసులు**

- గత ఏడాది మొత్తం కేసులు 1,811..
- ఈ ఏడాది ఇప్పటి వరకు 1004 కేసులు
- తాజాగా మలేరియాతో మహిళ మృతి
- మరో ముగ్గురు విద్యార్థులు ఆస్పత్రి చేరిక
- పటిష్ఠ చర్యలు చేపట్టకుంటే ముప్పే

పాడేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి):
ఏజెన్సీలో చాపకింద నీరులా మలేరియా విజృంభిస్తున్నది. గత రెండేళ్లతో పోల్చిస్తే ఈ ఏడాది మలేరియా కేసులు అధికంగానే నమోదవుతున్నాయి. పాడేరు జిల్లా ఆస్పత్రిలో శనివారం రాత్రి మలేరియాతో బాధపడుతూ ఒక గిరిజన మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు విద్యార్థులు ఆస్పత్రిలో చేరారు. ఏజెన్సీలో గత రెండేళ్లుగా మలేరియా నిర్మూలన కార్యక్రమాలు సక్రమంగా జరగలేదు. దీంతో ఈ ఏడాది మలేరియా కేసులు సైతం అధికంగానే నమోదవుతున్నారు. ఈ ఏడాది జూన్ 30 నాటికి ఏజెన్సీ వ్యాప్తంగా 1,004 మలేరియా కేసులు నమోదు కాగా గతేడాది (2023) మొత్తం 1,811 మలేరియా కేసులు నమోదయ్యాయి. అలాగే ఆస్పత్రులకు సైతం జ్వర, మలేరియా బాధితుల తాకిడి పెరిగింది. క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు పక్కాగా అందిస్తేనే తాజా పరిస్థితుల్లో జ్వరాలు, మలేరియా అదుపులో ఉంటుందని, ఏ మాత్రం అలక్ష్యం చేసినా ముప్పు వాటిల్లే ప్రమాదముందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

**సెరిబ్రల్ మలేరియాతో గిరిజన మహిళ మృతి**

స్థానిక జిల్లా ఆస్పత్రిలో పాడేరు మండలం దేవాపురం గ్రామానికి చెందిన కె.రత్నామణి (37) గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ శనివారం ఈదుపాలెం పీహెచ్‌సీలో చేరారు. ఆమెను పరీక్షించిన వైద్య సిబ్బంది మలేరియా ఉందని నిర్ధారించి, మెరుగైన వైద్య సేవలకు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ వైద్య సేవలు పొందుతూ శనివారం సాయంత్రం రత్నామణి మృతి చెందింది. అయితే ఈ విషయాన్ని వైద్యారోగ్య, మలేరియా విభాగం అధికారులు గోప్యంగా ఉంచారు. రత్నామణికి సెరిబ్రల్ మలేరియా కావడం వల్లే సకాలంలో వైద్య సేవలు అందక మృతి చెందిందని పలువురు అంటున్నారు. ఆమెకు మలేరియా వచ్చిన విషయాన్ని గుర్తించకపోవడం, పరిస్థితి విషమించిన తర్వాత ఆస్పత్రికి తీసుకొని రావడంతోనే ఫలితం దక్కలేదని స్థానికులు అంటున్నారు. అయితే క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది అప్రమత్తంగా లేకపోవడం వల్లే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని మృతురాలు బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలో పలు ఆశ్రమ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు జ్వరం సోకడంతో శనివారం స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. వారికి రక్త పరీక్షలు నిర్వహించగా

... మిగతా 8వ పేజీలో



ఆస్పత్రిలో మృతి చెందిన రత్నామణి



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మలేరియా బాధిత విద్యార్థులను పరామర్శిస్తున్న టీడబ్ల్యూ డీడీ కొండలరావు

## కొర్ర సాగుకు ఇదే అదను



పరిశోధన స్థానంలో సాగుచేస్తున్న కొర్ర పంట

- నూతన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- ఏజెన్సీలో 1,800 ఎకరాల్లో సాగు

- 8లో



# విశాఖ భూ దందాపై ప్రభుత్వం ఫోకస్!

## నేడు అమరావతిలో శ్వేతపత్రం విడుదల

- ఉమ్మడి జిల్లాలో సాగిన వ్యవహారాలపై ఆరా
- ఎయిర్‌పోర్టులో నిర్వహించిన సమీక్షలో వివరాలు తెలుసుకున్న సీఎం
- అడ్డగోలు దందాపై ముఖ్యమంత్రికి నివేదించిన టీడీపీ నేతలు
- విశాఖ ఫైల్స్ పేరుతో నివేదిక సిద్ధం చేశామన్న ఎమ్మెల్యే గంటా



కశింకోట మండలం విస్సన్నపేట వద్ద కొనుగోలు చేసిన భూముల్లో ఒక కొండను చదును చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి):
**విశాఖ కేంద్రంగా గత ప్రభుత్వ పాలకులు, వైసీపీ అనుచరులు సాగించిన భూ దందాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు భిన్నంగా విశాఖలో వేల కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు దోపిడీకి గురయ్యాయని కొత్త ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ దందాలు, గనుల దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయనున్నారు. ఇందులో ప్రధానంగా విశాఖలో భూదోపిడీపై పలు అంశాలను ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారని సమాచారం.**

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను కబ్జా చేయడం, బలవంతంగా లాక్కోవడం లాంటి అనేక దారుణ సంఘటనలు చోటుచేసుకున్నాయి. వాటన్నింటి వివరాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో సేకరించింది. విశాఖకు చెందిన తెలుగుదేశం నేతలు, జిల్లా యంత్రాంగం నుంచి వేర్వేరుగా సమాచారం తీసుకున్నట్టు తెలిసింది. విశాఖలో భూ కబ్జాలపై గతంలో పనిచేసిన ఒక ఐఏఎస్ అధికారి నుంచి కూడా వివరాలతో నివేదిక కూడా తీసుకున్నారని సమాచారం. కొత్తగా వచ్చిన జిల్లా కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ మరో నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. ఇంకా తెలుగుదేశం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివేదిక అందజేశారు. భూ కబ్జాలపై విశాఖ నుంచి సమగ్ర వివరాలు సేకరించడంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కీలకభూమి పోషించారని సమాచారం. నాలుగు రోజుల క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు విశాఖలో భూ కబ్జాలపై చర్యలు తీసుకుంటామని ప్రకటించిన నేపథ్యంలో

... మిగతా 8వ పేజీలో



విశాఖలోని దసపల్లా హిల్స్ స్థలాలు

# ఐటీడీఏలు నిర్వీర్యం

**రెండు, మూడేళ్లుగా జరగని పాలకమండలి సమావేశాలు**

- ఎటువంటి ఆమోదాలు లేకుండానే ఆర్థిక లావాదేవీలు
- రంపచోడవరం, పాడేరు, చింతూరు ఐటీడీఏలలో కోట్లలో నిధుల ఖర్చు

(రంపచోడవరం, పాడేరు-ఆంధ్రజ్యోతి)
జగన్ పాలనలో అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు, పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)లు నిర్వీర్యమయ్యాయి. గత మూడేళ్లుగా ఒక్కసారి కూడా పాలకమండలిని సమావేశపర్చకుండా మూడు ఐటీడీఏలకు చట్టబద్ధత లేకుండా చేశారు. పాలకమండలి ఆమోదాలు లేకుండానే ఈ మూడు ఐటీడీఏల్లో ఆర్థిక లావాదేవీలు సాగిపోయాయి. ప్రభుత్వ శాఖగా కాకుండా స్వయం ప్రతిపత్తి సొసైటీలుగా ఏర్పాటైన ఐటీడీఏలు సొసైటీల చట్టం కింద రూపొందించుకున్న నియమావళి మేరకే నడవాల్సి ఉంది. జిల్లా కలెక్టరు అధ్యక్షుడిగానూ, పార్లమెంటు సభ్యుడు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, స్థానిక సంస్థల మండల ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల జిల్లా ఉన్నతాధికారులు సభ్యులుగా కనీసం ప్రతి మూడు నెలలకు ఒకసారి పాలకమండలి సమావేశమై ఎప్పటికప్పుడు కార్యాచరణ ప్రణాళికలను నిర్దేశించుకోవాలి. ఏడాదికి ఒక వార్షిక సమావేశాన్ని కూడా నిర్వహించని దుస్థితిలో రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏలు ఉన్నాయి. ఒక్కసారి కూడా పాలకమండలి ఆమోదం తీసుకోకుండానే అధికారులు ఇష్టారాజ్యంగా కోట్లాది రూపాయలను ఖర్చు చేశారు. ఈ ప్రకారం ఐటీడీఏలు నిర్వీర్యమై చట్టబద్ధతను కోల్పోయాయి. నిబంధనల ప్రకారం ఐటీడీఏల ద్వారా అమలయ్యే ఏ కార్యకలాపమైనా పాలకమండలి ఆమోదంతోనే జరగాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల రాబడి, వ్యయాలు తదితర అంశాలన్నింటిని పాలకమండలి ఆమోదించాల్సిందే! కానీ గత మూడేళ్లుగా ఈ ఐటీడీఏలలో పాలకమండలి ఆమోదం లేకుండానే కోట్లాది రూపాయలతో కార్యకలాపాలు సాగాయి. రాష్ట్రంలో ఎక్కడా గడిచిన 48 సంవత్సరాలలో ఒక్క కోవిడ్ కాలంలో మినహా ఐటీడీఏల్లో పాలకమండలి సమావేశం లేని సంవత్సరమంటూ లేదు. 2019 డిసెంబరు తర్వాత రంపచోడవరం, 2021 సంవత్సరం డిసెంబరు 28 తర్వాత చింతూరు ఐటీడీఏ, 2022 ఏప్రిల్ తర్వాత పాడేరు ఐటీడీఏల్లో పాలకమండళ్లు లేకుండానే కార్యక్రమాలన్నీ జరిగిపోయాయి. తద్వారా ఈ ఐటీడీఏల్లో అధికారులు సాగించిన కోట్లాది రూపాయల ఆర్థిక లావాదేవీలకు చట్టబద్ధత లోపించింది. అంతేకాకుండా కోట్లాది రూపాయల నిధులను కూడా పాలకమండలి ఆమోదం లేకుండానే అప్పటి ప్రభుత్వ అవసరాలకు మళ్లించేశారు. సొసైటీ నిబంధనల ప్రకారం ఇంతవరకూ సాగిన కార్యక్రమాలకు చట్టబద్ధత లేనట్టేనా అన్న ప్రశ్నలు సర్వత్రా ఉత్పన్నమవుతున్న తరుణంలో అల్లూరి జిల్లా కలెక్టరుగా వచ్చిన దినేష్‌కుమార్ ఈ మూడు ఐటీడీఏల అధ్యక్షుడిగా ఎలా నిర్వహిస్తారో వేచి చూడాలి.




# ఏజెన్సీలో కుండపోత

**భారీ వర్షాలకు పొంగుతున్న గెడ్డలు ▸▸ జన జీవనానికి అంతరాయం**

- ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ పాయలు
- పెదబయలు మండలం కొత్తపుట్టు వద్ద నేలకొరిగిన 33 కేవీ విద్యుత్ స్తంభం
- వెలవెలబోయిన సీలేరు,ధారకొండ వారపు సంతలు
- చెరువులను తలపించిన పంట పొలాలు

పాడేరు/డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/పెదబయలు/సీలేరు/జి.మాడుగుల/, జూలై 14(ఆంధ్రజ్యోతి):
**మన్యంలో ఆదివారం కుండపోతగా వర్షం కురిసింది. దీంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా ముసురు కొనసాగుతుండగా ఆదివారం మాత్రం వర్షం తెరిపివ్వకుండా కురవడంతో వాగులు, గెడ్డలు, మత్స్యగెడ్డ పాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల కారణంగా గెడ్డలు దాటవద్దని అధికారులు సూచిస్తున్నారు. వ్యవసాయ పనులకు ఈ వర్షాలు అనుకూలిస్తాయని గిరిజన రైతులు అంటున్నారు.**

డుంబ్రిగుడ మండలంలో శని, ఆదివారాలు కురిసిన భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో సంపంగి గెడ్డ, చాపరాయి గెడ్డలు పొంగి ప్రవహించాయి. దీంతో గెడ్డల అవతల ఉన్న గ్రామాలకు చెందిన గిరిజనులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. గెడ్డలపై వంతెనలను నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

ముంచంగిపుట్టు మండలంలో మత్స్యగెడ్డ పాయలు, వాగులు, వంకలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రహదారులు ఛిద్రమైపోయాయి. మట్టి రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. లక్ష్మీపురం పంచాయతీ కర్లాపొదర్, దొరగూడ, బిర్రుగూడ, ఉబ్బెంగుల తదితర ప్రాంతాల్లో మత్స్యగెడ్డ పాయలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలకు సంబంధించిన సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవరోధంగా మారింది. జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో వరద నీరు ఇన్‌ఫ్లో పెరిగింది.

పెదబయలు మండలంలో కురుస్తున్న భారీ వర్షానికి మారుమూల జామిగూడ, గిన్నెలకోట పంచాయతీల్లో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయ పంచాయతీల పరిధిలోని ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు నిత్యావసర వస్తువులు లేక అవస్థలు పడుతున్నారు. ఆదివారం అడుగులపుట్టు పంచాయతీ కొత్తపుట్టు వద్ద పెదబయలు నుంచి ముంచంగిపుట్టు వైపు వెళుతున్న 33 కేవీ విద్యుత్ స్తంభం నేలకొరిగింది.

జీకేవీధి మండలం సీలేరు, ధారకొండల్లో వర్షంతో వారపు సంతలు వెలవెలబోయాయి. తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా భారీగా వర్షం కురుస్తుండడంతో ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల గిరిజనులు సీలేరు, ధారకొండ

... మిగతా 8వ పేజీలో



ముంచంగిపుట్టు మండలం కర్లాపొదర్ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



రింతాడ జాతీయ రహదారిపై పడిన విద్యుత్ స్తంభం

## బలిఘట్టంలో ఇసుక అక్రమ నిల్వలు

- టిప్పర్లతో రాజమండ్రి నుంచి తీసుకొచ్చి అమ్మకాలు
- ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా
- ఇష్టానుసారం ఇసుక ధరలు పెంచి విక్రయం


ట్రాక్టర్‌లోకి ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

**నర్సీపట్నం, జూలై 14 :** పలు ప్రాంతాల్లో ఇసుక అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టిప్పర్లతో రాజమండ్రిని నుంచి ఇసుక తీసుకొచ్చి బలిఘట్టం, చెట్టుపల్లిలో పోగులు పెట్టి నిల్వ ఉంచుతున్నారు. ఇప్పటికే గబ్బాడ ఇసుక డిపోలో అవకతవకలపై సభాపతి అయ్యన్నపాత్రుడు అధికారులకు విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. విచారణ పూర్తయ్యే వరకు డిపోలో ఇసుక బయటకు తీయవద్దని స్పష్టం చేశారు. దీన్ని అదనుగా తీసుకొని రాజమండ్రి నుంచి టిప్పర్లతో ఇసుక అక్రమంగా తరలించి వ్యాపారం చేస్తున్నారు. నిబంధనలు ప్రకారం రాజమండ్రి ఇసుక ర్యాంప్ నుంచి 20కిలోమీటర్లు పరిధి దాటి ఇసుక రవాణా చేయకూడదు. సొంత అవసరాలకు మాత్రమే వాడుకోవాలి. అధికారులు పట్టించుకోకపోవడంతో దర్జాగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే.. రెవెన్యూ సెబ్, పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసే అధికారం ఉంది. మైనింగ్ అధికారులు అపరాధ రుసుం వసూలు చేస్తారు.

టిప్పర్లతో తీసుకొచ్చిన ఇసుక బలిఘట్టం కాటా సమీపం వద్ద చెట్టుపల్లి, మరికొన్ని ప్రాంతాలలో అక్రమంగా నిల్వ ఉంచి ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.5 వేలు నుంచి రూ.7 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. బుధవారం ఉదయం బలిఘట్టం వై జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ని సీజ్ చేశామని ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. అయితే అధికారులు మాత్రం అడపాదడపా చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే నర్సీపట్నం మైనింగ్ అధికారులు రూ.10 వేలు అపరాధ రుసుం రాసినట్టు చెప్పారు. ఈ విషయమై సబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్ దృష్టికి తీసుకు వెళ్లగా ఇసుక అక్రమ నిల్వలపై చర్యలు తీసుకుంటున్నామని, రెండు రోజుల కిందట మూడు ట్రాక్టర్లను సీజన్ చేశామని తెలిపారు. ఇసుక అక్రమ తవ్వకాలపై గట్టి నిఘా ఉంచామన్నారు.

## దాడికి గురైన కానిస్టేబుల్‌ను పరామర్శించిన హోం మంత్రి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ అప్పారావును పరామర్శిస్తున్న మంత్రి అనిత

**విశాఖపట్నం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) :** గంజాయి మత్తులో ఉన్న యువకుడు దాడి చేయడంతో గాయపడి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సబ్బి అప్పారావును రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, నిందితుడ్ని కఠినంగా శిక్షిస్తామన్నారు. అప్పారావు కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పోలీసుల్లో ఆత్మస్థైర్యం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సీపీ మాట్లాడుతూ శాఖాపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని అతని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. కాగా దాడికి పాల్పడిన భార్గవ్‌రెడ్డిపై త్రీ టౌన్ పోలీసులు బీఎన్ఎస్ 121(2) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి ఆదివారం న్యాయమూర్తి ముందు హాజరుపరచగా ఏడు రోజులు రిమాండ్ విధించారు.

## జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

**కొత్తూరు, జూలై 14 :** ఇక్కడి రోటరీ క్లబ్‌లో జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవాధ్యక్షులు కన్నేపల్లి గౌరీపతి, రేజేటి రామాచార్యులు, కె.విశ్వనాథం ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంటి రవికుమార్, ఉపాధ్యక్షుడు పేరూరి భోగలింగం, ప్రధాన కార్యదర్శి టీవీ మల్లికార్జున ప్రశాంత్, సహాయ కార్యదర్శులుగా దొరబాబు, సురేగా, ట్రెజరర్‌గా కామేష్, జాయింట్ ట్రెజరర్లుగా సోమశేఖర్, తమ్మిరాజు శ్యామ్‌కుమార్‌లతో పాటు పలువుర్ని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ అనకాపల్లిలో బ్రాహ్మణులకు సరైన కమ్యూనిటీ భవనం లేదన్నారు. అంతా ఐకమత్యంతో సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## తూర్పుకోస్తా రైల్వే, టీసీఎఫ్‌ఏ జట్లు గెలుపు


రైల్వేస్, మరిడిమాంబ జట్ల మధ్య మ్యాచ్

**విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 14:** ఏయూ గ్రౌండ్‌లో జరుగుతున్న జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తూర్పుకోస్తారైల్వే, టీ కోర్టు ఫుట్‌బాల్ అసోసియేషన్ (టీసీఎఫ్‌ఏ) జట్లు గెలుపొందాయి. సాయంత్రం జరిగిన తొలి మ్యాచ్‌లో రైల్వే 3-0 గోల్స్ తేడాతో మరిడిమాంబ ఫుట్‌బాల్ క్లబ్‌పై విజయం సాధించింది. ఆట ప్రథమార్థంలో రైల్వే ఆటగాళ్లు సాయి, సురేష్ చెరో గోల్ చేయగా, రెండో భాగంగా సీనియర్ ఆటగాడు సీతారామరాజు మరో గోల్ చేసి ఆధిక్యాన్ని పెంచాడు. మరో మ్యాచ్‌లో టీసీ ఎఫ్‌ఏ 1-0 గోల్‌తో కోదండరామ ఫుట్‌బాల్ క్లబ్‌పై (ఎస్‌కేఆర్‌ఎఫ్‌సీ) గెలుపొందింది. ప్రథమార్థం హోరాహోరీగా సాగిన ఈమ్యాచ్‌లో ఇరుజట్లు గోల్ సాధించలేకపోయారు. రెండోభాగంలో టీసీఎఫ్‌ఏ స్ట్రైకర్ సాయి శివరామ తేజ గోల్ చేసి జట్టుకు విజయాన్నందించాడు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 95.00 |
| లైవ్ ధర | 115.00 |
| విత్ స్కిన్ | 200.00 |
| స్కిన్ లెస్ | 210.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 575 |
| విజయనగరం | 579 |
| శ్రీకాకుళం | 579 |

## పచ్చని పార్కు పై.. పంచాయతీ నిర్లక్ష్యం!

**కొరవడిన పరిశుభ్రత**

- ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం
- పాముల సంచారంతో అడుగు పెట్టాలంటేనే భయం
- ఆహ్లాదకర వాతావరణానికి దూరమవుతున్న 'పేట'వాసులు


పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం


పాయకరావుపేటలో గల దాసరి గవర్రాజు స్మారక పార్కు

**పాయకరావుపేట, జూలై 14 :** పచ్చని మొక్కలు, అందమైన పూల పరిమళాలతో సందర్శకులకు ఆహ్లాదం పంచాల్సిన పాయకరావుపేటలోని దాసరి గవర్రాజు పార్కు నేడు పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా మారింది. గత కొంతకాలంగా దీని నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో అధ్వానంగా తయారైంది. పార్కు ఆవరణలో శుభ్రం చేయక ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోగా, తోపుడు బళ్లను పార్కులో పెడుతుండడంతో మరింత కళావిహీనంగా కనిపిస్తోంది. దీనికితోడు పాములు సంచరిస్తుండడంతో పార్కులో ఉన్న లైబ్రరీకి సైతం వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు.


అధ్వాన్నంగా ఉన్న రీడింగ్ రూమ్ పరిసరాలు

పట్టణంలోని సూర్యమహల్ సెంటర్‌లో దశాబ్దకాలం క్రితం వరకు అధ్వానంగా ఉన్న దాసరి గవర్రాజు స్మారక పార్కును అప్పటి పంచాయతీ సర్పంచ్ పెదిరెడ్డి చిట్టిబాబు సహాయ సహకారాలతో అన్ని వసతులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. అదేవిధంగా పార్కు ఆవరణలో ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలోనే మొట్టమొదటి ఏసీ శాఖా గ్రంథాలయం ఏర్పాటు చేయడం జరిగింది. రోజూ పార్కును శుభ్రంచేసి, పూల మొక్కల సంరక్షణకు పంచాయతీ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. అయితే గత కొంతకాలంగా పార్కును పట్టించుకున్నవారు లేకపోవడంతో పాటు పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పార్కులో పిల్లల ఆట వస్తువులు పాడయ్యాయి. ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు బయటి వ్యక్తులు పార్కు ఆవరణలో తోపుడు బళ్ళు, ఇతర సామగ్రిని పెడుతుండడంతో మరింత అధ్వానంగా దర్శనమిస్తోంది. దీనికితోడు పాములు సంచరిస్తుండడంతో పార్కులోకి ఎవరూ రాకపోగా పార్కు ఆవరణలో ఉన్న లైబ్రరీకి వచ్చేందుకు కూడా ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కును తీర్చిదిద్దాలని పట్టణవాసులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావును వివరణ కోరగా, పార్కు నిర్వహణకు పంచాయతీ సిబ్బంది ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. దీనిపై పలుమార్లు పంచాయతీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోందన్నారు.


తోపుడు బళ్ళను పెట్టిన దృశ్యం

## జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలి


- యూటీఎఫ్ నాయకుల డిమాండ్
- సీఐటీయూ కార్యాలయం వద్ద ఆందోళన


జీవో ప్రతులను దగ్ధం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

**అనకాపల్లి టౌన్, జూలై 14:** సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయి డిమాండ్ చేశారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయం వద్ద ఆదివారం సదరు జీవో ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా చినబ్బాయి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏళ్ల తరబడి ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు సాగిస్తున్నట్టు చెప్పారు. కూటమి అధికారంలోకి వస్తే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తుందని నమ్మామని, కానీ కొత్త ప్రభుత్వ హయాంలో జీపీఎస్‌ను చట్టబద్ధం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ రావడం చాలా అన్యాయమన్నారు. ఎన్నికల ముందు పవన్ కల్యాణ్, లోకేశ్‌లు కూటమి అధికారంలోకి వస్తే సీపీఎస్ స్థానంలో జీపీఎస్ కంటే మెరుగైన విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూస్తే పోరాటాలకు సన్నద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లయ్యబాబు, ఎంవీ అప్పారావు, జిల్లా కార్యదర్శి శేషుబాబు, కోశాధికారి జోగా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరం :** జీపీఎస్ విధానం 2023 అక్టోబరు నుంచే అములులోకి వచ్చిందంటూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, ప్రతినిధి ఎస్.దుర్గాప్రసాద్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని తమ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు తీవ్రంగా నష్టపోయే ఈ జీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేస్తూ సవరణ గెజిట్ విడుదల చేయాలని వారు కోరారు.

## 98 మీటర్లకు చేరిన 'కోనాం' నీటిమట్టం


నీటితో కళకళలాడుతున్న కోనాం జలాశయం

**చీడికాడ, జూలై 14:** మండలంలోని కోనాం జలాశయం ఎగువన ఏజెన్సీ అటవీ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో నీటి ప్రవాహం పెరుగుతూ జలాశయానికి గెడ్డల ద్వారా సాగునీరు చేరుతోంది. అయితే అధికారుల నిర్లక్ష్యమో, రైతుల శాపమో తెలియదు గాని వచ్చిన నీటిలో 50 క్యూసెక్కుల మేర మెయిన్‌గేట్లు ద్వారా ప్రతిరోజు దిగువ కాలువకు వృథాగా కిందికి పోతోంది. దీంతో ఎగువ కాలువ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు. ఆదివారం సాయంత్రానికి 98 మీటర్లకు చేరు కొంది. ఇన్‌ఫ్లో 200 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 50 క్యూసెక్కులు కాగా, గత ఏడాది ఇదేనెల ఇదే రోజు నాటికి 95.25 మీటర్లు నీటిమట్టం ఉంది. అయితే ఈ నెల 14 నాటికి నీటిమట్టం పెరగడంతో సాగురైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.


మెయిన్ గేటు ద్వారా వృథాగా పోతున్న నీరు

## తాండవ నదిలోకి వర్షపునీరు

- మినీ ఆనకట్టల వద్ద జలకళ
- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు


పాయకరావుపేటలోని భూమి ఆనకట్ట వద్ద పారుతున్న నీరు

**పాయకరావుపేట, జూలై 14:** గత కొద్ది రోజులుగా ఎగువ ప్రాంతంలో పడుతున్న వర్షాలకు పాయకరావుపేట వద్ద తాండవ నదికి జలకళ సంతరించుకుంది. పట్టణ పరిధిలోని నదిపై ఉన్న భూమి ఆనకట్టకు నీరు చేరుతుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తాండవ నదిపై ఉన్న భూమి, ముఠా ఆనకట్టల ద్వారా పాయకరావుపేట, నక్కపల్లి, తుని మండలాల్లో భూములకు ఏటా ఖరీఫ్‌లో సాగు నీరందుతోంది. ఆనకట్టలపై ఆధారపడి పలు గ్రామాల్లో రబీలో కూడా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో ఆనకట్టల మధ్య నీరు నిల్వ ఉంటున్నందున పట్టణ పరిధిలో భూగర్భజలాలు వృద్ధి చెంది తాగునీరు పుష్కలంగా లభిస్తోంది. ప్రస్తుతం ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై నెల కావస్తున్నా తాండవ నది ఎగువ ప్రాంతంలో సరైన వర్షాలు లేకపో వడంతో నదిలోకి పెద్దగా నీరు చేరలేదు. అయితే గత కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలకు తాండవ నదిలోకి నీరు చేరుతుండడం ప్రారంభమైంది. దీంతో పట్టణంలోని భూమి, ముఠా, మంగవరం చానెళ్ల ద్వారా ఆయకట్టు భూములకు నీరంద నుంది. దీనికితోడు మండలంలో అడపాదడపా పడుతున్న వర్షాలకు పలు గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లోకి నీరు చేరడంతో నారుమడులు వేసే పనిలో రైతులు ఉన్నారు. అయితే ఈ ఏడాది కూడా పంట కాలువల్లో పూడిక తీయకపోవడం, పాడైన డివిజన్‌డ్యామ్‌లు, గేట్ల మరమ్మతులు కారణంగా నీరు వృథాగా పోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## విద్యార్థుల కోసం లయన్స్ గ్రంథాలయం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రరీ సౌకర్యం
- రూ.20 లక్షలతో ఏర్పాటు
- అందుబాటులో 2300కు పైగా పుస్తకాలు


గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న పాఠకులు

**నర్సీపట్నం, జూలై 14 :** జిల్లాలో ఏ జూనియర్ కళాశాలకు లేని గ్రంథాలయం సౌకర్యం నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉంది. ఇది విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు, పుస్తక ప్రియులకు ఎంతో ఉపయోగపడుతోంది. ఈ లైబ్రరీలో దినపత్రికలతో పాటు అకడమిక్, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉండటంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.

ఈ కళాశాలలో రూ.20 లక్షలతో లయన్స్ క్లబ్ వారు గ్రంథాలయం భవనాన్ని నిర్మించి గత సంవత్సరం ఇంటర్నేషనల్ గవర్నర్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఇందులో 150 పైగా పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ మరో 150 పోటీ పరీక్షలు, వివిధ రకాల పుస్తకాలు వితరణ చేశారు. ప్రస్తుతం లైబ్రరీలో 2,300 పైగా పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. పాఠ్య పుస్తకాలు సమకూర్చడంతో పేద విద్యార్థులకు ఉపయోగ పడుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 20 ఉండగా, కేవలం నర్సీపట్నం జూనియర్ కళాశాలలో మాత్రమే ఇన్ని సదుపాయాలతో లైబ్రరీ సౌకర్యం అందుబాటులో ఉండడం విశేషం. మిగిలిన కళాశాలలో గ్రంథాలయాధికారులు పోస్టులు ఉన్నప్పటికీ భవనాలు అందుబాటులో లేక ఉపయోగం ఉండటం లేదు. నర్సీపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రరీ, గ్రంథాలయాధికారి, పోటీ పరీక్షలు, రిఫరెన్స్ ఎకడమిక్ పుస్తకాలు అందుబాటులో ఉండటంతో విద్యార్థులకు మేలు కలుగుతోంది.

**లయన్స్ క్లబ్ దత్తత కళాశాల...**

లయన్స్ క్లబ్ ఈ కళాశాలను దత్తత తీసుకొని గత పదేళ్లుగా విద్యార్థులకు అవసరమైన వసతులు సమకూర్చుతోంది. ప్రతిసంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ, క్రీడా పరికరాలు పంపిణీ చేస్తున్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నారు. విద్యార్థుల ప్రగతికి కారణమైన అధ్యాపకులను ఏటా సెప్టెంబరు 5 గురు పూజోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించి ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల 35 మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. గత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించిన ఆరుగురు మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు.

## కృష్ణావతారంలో జగన్నాథస్వామి


కృష్ణావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

**అనకాపల్లి టౌన్, జూలై 14:** పట్టణంలోని గూడ్స్ షెడ్డు వద్ద గల ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఆదివారం కృష్ణావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ తొలుత స్వామివారికి విశేష అలంకరణలు చేపట్టి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కుటుంబాలతో సహా తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజ సులోచన, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## చోడవరంలో రామావతారం

**జగన్నాథుని రథోత్సవాల సందర్భంగా దశ రూప మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జగన్నాథస్వామి రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. - చోడవరం**


శ్రీరామావతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి

## భక్తులతో కిటకిటలాడిన నూకాంబిక ఆలయం


రద్దీగా ఉన్న క్యూ లైన్లు


బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**అనకాపల్లి టౌన్, జూలై 14:** ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము ఆరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. విశాఖ ఉమ్మడి జిల్లా నలు మూలల నుంచి భక్తులు ఆలయానికి రావడంతో అన్నిమార్గాలు సందడిగా మారాయి. కుటుంబాలతో సహా విచ్చేసిన పలువురు భక్తులు ఆలయ పరిసరాల్లో వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఆరగించారు. ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## వైజాగ్ వారియర్స్‌కు రూ.10 లక్షల నజరానా

**విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 14:** ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-3 చాంపియన్‌గా నిలిచిన వైజాగ్ వారియర్స్‌కు ఫ్రాంచైజ్ సహ యజమాని డాక్టర్ నరేంద్రరామ్ రూ.పది లక్షల నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన ఫైనల్స్‌లో వైజాగ్ వారియర్స్ 87 పరుగుల తేడాతో ఉత్తరాంధ్ర లయన్స్‌ను చిత్తుచేసి ట్రోఫీని కైవసం చేసుకుంది. టోర్నీ ఆద్యంతం రాణించడమే కాకుండా ఫైనల్స్‌లోనూ ఉత్తరాంధ్ర లయన్స్‌పై అద్భుత విజయం సాధించి సీజన్-3 టైటిల్‌ను సొంతం చేసుకోవడం ఆనందాయకమన్నారు.

# కొర్ర సాగుకు ఇదే అదను

**చింతపల్లి, జూలై 14:** గిరిజన ప్రాంతంలో పండించే చిరుధాన్య పంటలలో రాగి, సామ తరువాత కొర్ర పంటను రైతులు సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో కొర్ర సాగు విస్తీర్ణం 25 వేల ఎకరాలు కాగా పాడేరు డివిజన్‌లోని పదకొండు మండలాల్లో 1,800 ఎకరాల్లో గిరిజన రైతులు సాగుచేస్తున్నారు. కొర్ర సాగులో నూతన వంగడాలను నాటుకుంటే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

**ఏజెన్సీకి అనువైన రకాలు:** రేనాడు, ప్రసాద్, క్రిష్ణదేవరాయ, నర్సింహారాయ్, శ్రీలక్ష్మి, సాయి 3035.

**నేలలు, విత్తే కాలం:** తేలిక పాటి నల్లరేగడి నేలలు, మురుగునీటి పారుదల నేలలు. ఖరీఫ్‌లో జూలై నెలాఖరు వరకు నాట్లు వేసుకోవాలి.

**విత్తే మోతాదు:** వరుసలలో నాట్లు వేసుకుంటే ఎకరానికి రెండు కిలోలు, వెదజల్లే పద్ధతిలో సాగు చేసుకుంటే ఎకరానికి నాలుగు కిలోల విత్తనం అవసరమవుతోంది.

**విత్తే దూరం:** వరుసలలో నాటడానికీ వరుసల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల దూరంలో నాట్లు వేసుకోవాలి.

**ఎరువులు:** పశువుల గత్తం ఎరువు ఎకరానికి 2 టన్నులు వేసుకోవాలి. యూరియా ఎకరానికి 17 కిలోలు నాటిన 30 రోజుల తర్వాత వేయాలి.

**కలుపు నివారణ:** వరుసలలో వేసిన పంటను 2-3 సార్లు చేతితో కలుపుని

## నూతన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

తీసుకోవాలి. విత్తిన 30 రోజుల వరకూ పంట పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.

**చీడపీడల నివారణ:**

- పంటలో చెదల నివారణకు మలాథియాన్ ఎకరానికి 8 కిలోలు పొడి మందును చల్లుకోవాలి.
- కాండం తొలుపు పురుగు ఆశించినట్టు గుర్తిస్తే ఎండోసల్ఫాన్ ఎకరానికి లీటరు నీటిలో రెండు మిల్లీలీటర్లు కలిపి రెండుసార్లు 20-30 రోజుల మధ్యలో పిచికారి చేయాలి.
- తుప్పు తెగులు నివారణకు మాంకోజెబ్ 2.5గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- అగ్గి తెగులు నివారణకు కాప్టాన్‌గాని లేదా థైరామ్‌గాని మూడు గ్రాములు కిలో విత్తనానికి కలిపి నాట్లు వేయడానికి ముందు విత్తన శుద్ధి చేయాలి. పంటలో తెగులు ఆశించిన సమయంలో లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్‌గాని, మాంకోజబ్ 2.5 గ్రాములు గాని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.



పరిశోధన స్థానంలో సాగుచేస్తున్న కొర్ర పంట

### సాగు విధానంలో మార్పు రావాలి

**-డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, ఏడీఆర్, ఆర్ఏఆర్ఎస్, చింతపల్లి**



కొర్ర పంట సాగు విధానంలో మార్పు రావాలి. గిరిజన రైతులు ఇప్పటికీ పాతపద్ధతులతో సాగు చేస్తున్నారు. నూతన సేద్య పద్ధతులను పాటిస్తూ నూతన వంగడాలను నాటుకుంటే అధిక దిగుబడులు వస్తాయి. కొర్ర సాగులో పాటించాల్సిన మెలకువలు, నూతన పద్ధతులను రైతులకు శిక్షణ ఇస్తున్నాం. సాగుపై సందేహాలకు పరిశోధన స్థానాన్ని సంప్రదించవచ్చు.

# ఆశ్రమాలు, గురుకులాలకు గ్యాస్ కష్టాలు

- జీసీసీ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసిన ఆదాయపన్నుల శాఖ
- గ్యాస్ సిలిండర్లు సరఫరాను నిలిపి వేసిన జీసీసీ
- ఇబ్బందులు పడుతున్న ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు

**కొయ్యూరు, జూలై 14:** గిరిజన సహకార సంస్థ బ్యాంకు ఖాతాలను ఆదాయ పన్ను శాఖ ఫ్రీజ్ చేయడంతో దాని ప్రభావం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలపై పడింది. వీటికి అవసరమైన గ్యాస్ సిలిండర్లు విడిపించుకునేందుకు నిధుల సమస్య ఏర్పడింది. దీంతో పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులకు గ్యాస్ కష్టాలు మొదలయ్యాయి. వివరాల్లోకి వెళితే..

పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాలలో 11 గురుకుల పాఠశాలలు, 11 గురుకుల కళాశాలలు, 11 ఏకలవ్య పాఠశాలలతోపాటు మరో 130 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలన్నింటికీ విద్యార్థుల సంఖ్య అనుసరించి నెలకు రెండు నుంచి మూడు గ్యాస్ సిలిండర్లు అవసరమవుతాయి. గ్యాస్ సిలెండర్ రూ.915 కాగా.. దీని ప్రకారం పాఠశాల ఒక్కింటికి 1,830 నుంచి రూ.2,800 వరకు ఖర్చు అవుతుంది. గ్యాస్ సిలెండర్లుతోపాటు సరుకులను జీసీసీ ప్రతీ నెలా సరఫరా చేస్తుంది. డైట్ బిల్లు మంజూరు కాగానే జీసీసీ జమ చేసుకునేది. గ్యాస్ సిలిండర్ల కోసం హెచ్‌పీసీఎల్‌కు జీసీసీ సొంత నిధులను చెల్లించి పాఠశాలలకు సరఫరా చేసేది. అయితే ఇటీవల జీసీసీ ఆర్థిక లావాదేవీలపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడి చేశారు. ఆర్థిక లావాదేవీల నిర్వహణ, పన్నులు చెల్లింపులో తేడాలు కనుగొని గిరిజన సహకార సంస్థ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసింది. దీంతో జీసీసీకి పెట్టుబడి పెట్టేందుకు అవకాశం లేక గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపేసింది. పాఠశాలల పునఃప్రారంభమైన నాటి నుంచి గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో ఆయా పాఠశాలలు హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించి గ్యాస్ సిలెండర్లు తీసుకుంటున్నారు. దీంతో వారు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా మరో వారం, పది రోజులు కొనసాగితే గ్యాస్‌ను పూర్తిగా ఆపేసి తిరిగి కట్టెల పొయ్యిలపై వంటలు చేసే అవకాశం ఉందని ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు అంటున్నారు. ఈ విషయమై పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. ఇప్పటికే కొన్ని మండలాల పాఠశాలలకు గ్యాస్ సిలిండర్లు సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. మిగిలిన వాటికి గతంలో మాదిరి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇదే విషయాన్ని జీసీసీ చింతపల్లి డీఎం దేవరాజ్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. గిరిజన సహకార సంస్థకు సంబంధించి బ్యాంకు ఖాతాలను ఆదాయపన్నుల అధికారులు ఫ్రీజ్ చేయడం వాస్తవమేనన్నారు. అందువల్ల అరువు పద్ధతిలో గ్యాస్ సరఫరా నిలిపి వేయాల్సి వచ్చిందన్నారు. తమ ఆర్థిక లావాదేవీలపై విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు.





అమ్మవారి పాదాల వద్ద మొక్కు కోసం పాడేరు నుంచి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు... పాదాలును దర్శించుకోవడానికి వచ్చిన భక్తుల వాహనాలు

# మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

**పాడేరు రూరల్, జూలై 14:** ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి పాడేరు మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. మన్యంలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు ఉదయం 7 గంటల నుంచి తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. భారీ వర్షం కురిసినప్పటికీ షెడ్లు, భవన సదుపాయం ఉండడంతో మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని బంధు మిత్రులతో పండగలు చేసుకొని సాయంత్రం 5 గంటల వరకు ఆలయం వద్ద సందడిగా గడిపారు. అలాగే పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్ వద్ద ఉన్న అమ్మవారి పాదాల వద్దకు మొక్కులు తీర్చుకొనేందుకు మైదాన ప్రాంతం నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. వారంతా భారీ వర్షం కారణంగా వంటలు చేసుకొనేందుకు సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొంత మంది భక్తులు పాదాలు ప్రాంగణంలో వంటలు చేసుకొనే పరిస్థితి లేక స్వగ్రామాలకు వెనుదిరిగారు. అధికారులు, పాలకులు స్పందించి అమ్మవారి పాదాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

# విద్యార్థులకు సెలవు రోజుల్లో లఘు చిత్రాలు

- ఐటీడీఏ పీవో వి.అభిషేక్

**పాడేరు రూరల్, జూలై 14:** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడే చలన చిత్రాలను సెలవు దినాల్లో ప్రదర్శించడం జరుగుతుందని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. ఇందులో భాగంగానే ఆదివారం పాడేరులోని శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐ యామ్ కలాం చలన చిత్రాన్ని ప్రదర్శించినట్టు చెప్పారు. సెలవు దినాల్లో ఇటువంటి చిత్రాలను ప్రదర్శించడం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు సెలవుల్లో వారు స్వగ్రామాలకు (ఇళ్లకు) వెళ్లాలన్న దృష్టిని మరల్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. అందుకే ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొయ్యూరు గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో చిత్ర ప్రదర్శన దృశ్యం

### కొయ్యూరులో చిత్ర ప్రదర్శన

**కొయ్యూరు:** కొయ్యూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆదివారం ఐ యాం కలాం చలన చిత్రాన్ని ప్రదర్శించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వినోదాన్ని కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాలను ప్రదర్శిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రదర్శించిన ఐ యాం కలాం చిత్రాన్ని విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం వారంతా ఉత్సాహంగా గడిపారు.

# జీసీసీ చింతపల్లి డీఎం వేధింపులపై ఫిర్యాదు



మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధిత జీసీసీ సిబ్బంది

**పాడేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి):** జీసీసీ చింతపల్లి డివిజన్ మేనేజర్ దేవరాజు వేధింపుల నుంచి తమను రక్షించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్‌కు బాధిత సిబ్బంది ఆదివారం ఫిర్యాదు చేశారు. డీఎం దేవరాజు కింది స్థాయి సిబ్బందిని అకారణంగా వేధింపులకు గురిచేస్తున్నారని, ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించాలని ఒత్తిడి చేశారని, తేనె, అటవీ ఉత్పత్తుల కొనుగోలుతో పాటు పాత గోదాంలోని చెట్ల నరికవేతలో సైతం అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటువంటి అధికారులు గిరిజన ప్రాంతంలో పనిచేయడం వల్ల జీసీసీకి చెడ్డ పేరుతో పాటు సిబ్బంది మానసికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు సిబ్బంది తెలిపారు.

# బొర్రా గుహలుపై రైల్వే లైన్ పనులు నిలిపివేయండి



శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**అరకులోయ, జూలై 14:** బొర్రా గుహలుపై రైల్వే శాఖ డంబ్లింగ్ పనులను తక్షణమే నిలిపి వేయాలని బొర్రా మోటారు, గైడ్స్, కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్లు, బ్రో సంస్థ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి, టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. బొర్రా గుహలుపై రెండో ట్రాక్‌ను నిర్మించడం వల్ల గుహలు ప్రమాదకర పరిస్థితిలోకి వెళ్లడంతో పాటు వేలాది మంది ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ట్రాక్‌ను గుహలుపై నుంచి కాకుండా వేరే మార్గంలో ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని బొర్రా మోటారు యూనియన్ ప్రతినిదులు శ్యాం, ప్రేమ్ కుమార్, టీడీపీ మండల కార్యదర్శి తడబారికి ఆనందరావు, గైడ్స్, బొర్రాగుహలు ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు నరిసింహ, సోమేశ్వరావు, బ్రో ప్రతినిధులు కోరారు. ఈ సమస్యను సీఎం చంద్రబాబు, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లానని శ్రావణ్‌కుమార్ వారికి హామీ ఇచ్చారు.

# ఘాట్ రోడ్డులో చెట్ల కొమ్మల తొలగింపు

**పాడేరు రూరల్, జూలై 14:** నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పాడేరు ఘాట్ మార్గంలోని ప్రధాన రహదారిపై పడిన చెట్ల కొమ్మలను ఎస్‌హెచ్‌జే ఫౌండేషన్ ప్రతినిధులు తొలగిస్తున్నారు. వీటిని తొలగిస్తూ వాహనదారులకు ఇబ్బంది లేకుండా కృషి చేస్తున్న ఫౌండేషన్‌ను పలువురు వాహనదారులు, ప్రయాణికులు అభినందిస్తున్నారు. వర్షాల సమయంలో చెట్లు కొమ్మలు, అడ్డాకుల ఊడలు ప్రధాన రహదారిపై పడటంతో ప్రభుత్వ ప్రైవేటు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయాన్ని గ్రహించిన పాడేరు ఘాట్‌లోని వంట్లమామిడి గ్రామానికి చెందిన శ్రీహర్ష జనపరెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు ఎప్పటికప్పుడు వాటిని తొలగిస్తున్నారు. ఆదివారం గరికిబంధ నుంచి 12వ మైళ్ల వరకు రహదారిలో కొమ్మలను తొలగించారు.

# మన్యంలో విజృంభిస్తున్న మలేరియా

... 5వ పేజీ తరువాయి

మలేరియా ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో ముగ్గురు విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆదివారం నాటికి ఒక విద్యార్థి ఆరోగ్యం కాస్తా మెరుగుపడడంతో డిశ్చార్జి చేయగా మిలిగిన ఇద్దరు విద్యార్థులు ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.





డుంబ్రిగుడ: వరద నీటితో ప్రవహిస్తున్న చాపరాయిగెడ్డ... జి.మాడుగుల కుంబిడిసింగి రోడ్డులో అండంగిసింగి వంతెనపై ప్రవహిస్తున్న నీరు

# ఏజెన్సీలో కుండపోత

... 5వ పేజీ తరువాయి

వారపు సంతలకు రాలేకపోయారు. దీంతో కొనుగోలుదారులు లేక వ్యాపారాలు నిలిచిపోయాయి. జి.మాడుగుల మండలంలో కుంబిడిసింగి రహదారిలో అండంగిసింగి, రాళ్లగెడ్డ, కిల్లంకోట పంచాయతీ కోడిమామిడి వాగు, బొయతిలి పంచాయతీ సూరిమెట్ట కల్వర్టు, లువ్వాసింగి పంచాయతీ సంగులోయ, బొర్రాతాడే వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కుంబిడిసింగి పంచాయతీకి పోవు మార్గంలో అండంగిసింగి, రాళ్లగెడ్డ వంతెనల్లో నీరు ప్రమాద స్థాయికి చేరడంతో రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలిగింది. గూడెంకొత్తవీధి మండలంలో వర్షంతో ప్రధాన రహదారులు వాగులను తలపిస్తున్నాయి. రింతాడ వద్ద జాతీయ రహదారిపై బాలికల ఆశ్రమ పాఠశాల ఎదురుగా విద్యుత్ స్తంభం పడిపోయింది. అరగంట పాటు వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానిక ఉప సర్పంచ్ ఈపీడీసీఎల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం ఈపీడీసీఎల్ సిబ్బంది హుటాహుటిన విద్యుత్ స్తంభం, తీగలను తొలగించారు. అసరాడ గ్రామంలో కొబ్బరి చెట్టు విద్యుత్ తీగలపై పడిపోవడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఈపీడీసీఎల్ ఉద్యోగులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి స్తంభాలను తొలగించారు. వర్షం వల్ల జర్రెల వారపు సంతలో వినియోగదారులు, వర్తకులు ఇబ్బందులు పడ్డారు.



పాడేరు శివారు తలారిసింగి సమీపంలో వర్షం నీటితో నిండిన పొలాలు

# విశాఖ భూ దందాపై ప్రభుత్వం ఫోకస్!

... 5వ పేజీ తరువాయి

జిల్లా యంత్రాంగం నివేదిక రూపొందించినట్టు తెలిసింది.

### బే పార్కుతో ప్రారంభం

విశాఖలో బేపార్కు నుంచి భూ దందాల పంచాయితీ ప్రారంభమయింది. ఇది వైసీపీ ఐదేళ్ల పాలన ముగిసేవరకు కొనసాగింది. కార్తీకవనం చేజిక్కించుకుని రాడిసిన్ బ్లూ హోటల్ నిర్మాణం, భీమిలిలో భూ యజమానులను బెదిరించి భారీఎత్తున భూములు కారుచౌకగా లాక్కోవడం, దసపల్లా భూములను 22(ఎ) నుంచి తొలగించి ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తెకు చెందిన కంపెనీతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకోవడం వరకు కొనసాగింది. ఈ వ్యవహారంలో అప్పటి ప్రభుత్వంలో కీలక పెద్దల పాత్ర ఉందనేది బహిరంగ రహస్యం. రుషికొండ ప్రాంతంలోని పనోరమ హిల్స్ పరిసరాల్లో పలువురి నుంచి బలవంతంగా ప్లాట్లు తీసుకుని భారీ కట్టడాలు నిర్మిస్తున్నారు. మధురవాడ ఐటీ హిల్స్ సమీపంలో ఎన్‌సీసీకి చెందిన 100 ఎకరాల భూమిని బెదిరింపులకు పాల్పడి టేకోవర్ చేసుకుని, గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రి తమ్ముడికి అప్పగించారు. రుషికొండ తారకరామా లేఅవుట్‌లో రేడియంట్ కంపెనీకి చెందిన 50 ఎకరాలను కూడా లాక్కున్నారు. నగరంలో పలుచోట్ల అడ్డగోలుగా టీడీఆర్‌లు కొట్టేశారు.

### అసైన్డ్ భూములపైనా కన్ను

గ్రామీణ మండలాలైన ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తిలో అసైన్డ్ భూములను చేజిక్కించుకునేందుకు జీవో 596 జీవో తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కేఎస్ జవహర్‌రెడ్డి బినామీలు త్రిలోక్‌తో పాటు మరికొందరు వందల ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు పొంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఇలా సుమారు 2,500 ఎకరాలకు ఒప్పందాలు చేసుకుని, అడ్వాన్స్‌లు ఇచ్చి 500 నుంచి 600 ఎకరాలను రిజిస్టర్ చేసుకున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పరిసరాల్లోని భీమిలి మండలంలో పలువురు రైతులను బెదిరించి భూములు కొట్టేశారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి దృష్టి సారించడంతో విశాఖలో భూదందాలపై విశాఖ ఫైల్స్ పేరిట నివేదిక విడుదల చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే భీమిలి నియోజకవర్గంలో పలు ఆక్రమణలు, కబ్జాలపై ఆయన కొంత సమాచారం సేకరించారు.

### విస్సన్నపేట భూ దందాపై నివేదిక

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విస్సన్నపేటలో సుమారు 600 ఎకరాల భూ దందాపై ఇప్పటికే జిల్లా టీడీపీ నేతలు ముఖ్యమంత్రికి నివేదించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో కొందరు అనుచరులు విస్సన్నపేట భూములు చేజిక్కించుకున్నారన్నది ప్రధాన అభియోగం. ఈ భూముల్లో కొంతవరకు ప్రభుత్వ, అసైన్డ్, మిగులు భూములతోపాటు గెడ్డలు, వాగులు, రహదారులు ఉన్నాయి. దీనికితోడు విస్సన్నపేటలో భారీగా వనరుల విధ్వంసం జరిగింది. కాగా అనకాపల్లిలోని నాతవరం మండలం భమిడికలొద్దిలో లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్ తవ్వేశారు. అటవీ భూములు స్వాధీనం చేసుకుని చెట్లు కొట్టేసి, రోడ్లు వేసి లోపలకు ఎవరినీ అనుమతించకుండా ఒక మాఫియాను నడిపించారు. భమిడికలొద్దిలో తవ్వింది బాక్సైట్ గనులే అయినా లేటరైట్ పేరుతో తవ్వుకుని సొమ్ము చేసుకున్నారు. ఇక అనకాపల్లి మండలంలో మెటల్ క్వారీలను లీజుదారుల నుంచి బలవంతంగా స్వాధీనం చేసుకుని వేల క్యూబిక్ మీటర్లు తవ్వేశారు. ఈ భూ దందాలు, గనుల దోపిడీకి సంబంధించి వివరాలను అనకాపల్లి జిల్లా పార్టీ నాయకులు ముఖ్యమంత్రికి నివేదించారు.

## సంక్షిప్తంగా..

### జీపీఎస్ అమలుపై గెజిట్‌ను వెనక్కి తీసుకోవాలి

**పాడేరు రూరల్, జూలై 14:** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ విధానం జీపీఎస్‌ను అమలు చేస్తూ విడుదల చేసిన గెజిట్‌ను వెనక్కి తీసుకోవాలని రాష్ట్రో ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శేషగిరిరావు, గిడ్డి వరలక్ష్మి డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చి, దాని కంటే మెరుగైన విధానం అంటూ పేరు పెట్టి గ్యారంటీ పెన్షన్ స్కీమ్‌ను రూపొందించిందన్నారు. తరువాత జీపీఎస్ విధానాన్ని అమలు చేస్తూ పూర్వ ఆర్థిక కార్యదర్శి రావత్ సంతకం చేసిన జీపీఎస్ గెజిట్‌ను ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం విడుదల చేయడంపై అంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. గత ప్రభుత్వ విధానాలను అనుసరిస్తున్నారా? వాటిని సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆ గెజిట్‌ను వెనక్కి తీసుకోవాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు.

### జీపీఎస్ జీవోను రద్దు చేయండి

**చింతపల్లి, జూలై 14:** వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ చీకటి జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులు నాయుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు కృష్ణయ్య, గిరి ప్రసాద్‌రెడ్డిని ఆదివారం కలిసి వినతిపత్రం అందించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులపై బలవంతంగా జీపీఎస్‌ను రుద్దాలని చూసిందన్నారు. ఈ జీవోను ప్రభుత్వం రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. అలాగే జీవో నంబరు 117 రద్దు చేయాలన్నారు. గిరిజన ప్రాంత నిరుద్యోగులకు శతశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నంబరు-3ను పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఆన్‌లైన్ పని ఒత్తిడి తగ్గించాలని ఆయన కోరారు. కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నెలవారీగా వేతనాలు చెల్లించాలన్నారు.

### తల్లికి వందనం పథకంపై దుష్ప్రచారం తగదు

**చింతపల్లి, జూలై 14:** తల్లికి వందనం పథకంపై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు అన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యాచరణ ప్రారంభించారన్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించక ముందే వైసీపీ నాయకులు ఎదురుదాడికి దిగడం సిగ్గుచేటన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సాయం ప్రభుత్వం కచ్చితంగా అందిస్తుందన్నారు. వైసీపీ అనుకూల పత్రిక, సోషల్ మీడియాలో వైసీపీ నాయకులు తల్లికి వందనం పథకంపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రతిపక్ష నాయకులు కుట్ర చేస్తున్నారని, ఈ కుట్రలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ నేత బేరా సత్యనారాయణపడాల్ పాల్గొన్నారు.

### సీలేరు రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలలకు భారీ చేపలు



మత్స్యకారులకు చిక్కిన చేపలు ఇవే..

**సీలేరు, జూలై 14:** సీలేరు పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలకు రిజర్వాయర్‌లో (ఎర్ర నీరు) వరద నీరు చేరడంతో మత్స్యకారుల వలలకు చేపలు విరివిగా చిక్కుతున్నాయి. గండుమీనలు, రవ్వలు, నల్లబొచ్చులు, బోటీ వంటి వివిధ రకాల చేపలు రెండు కిలోల నుంచి ఐదు కిలోల బరువు గల చేపలు మత్స్యకారుల వలకు చిక్కి కాసులను కురిపిస్తున్నాయి. సీలేరు మార్కెట్‌లో వీటికి భారీ డిమాండ్ ఏర్పడుతోంది. కిలో రూ.200 చొప్పున మత్స్యకారులు విక్రయిస్తున్నా హాట్‌కేక్‌ల్లా అమ్ముడుపోతున్నాయి. సీలేరులో రిజర్వాయర్ అరుదైన చేపలు లభిస్తుండంతో పాటు తాజాగా ఉండడంతో మాంసం ప్రియులు ఆదివారం వీటి కొనుగోలుపై ఎక్కువ మక్కువ చూపారు.

### బత్తునూరు వాగుపై వంతెన నిర్మించరూ..



బయోమెట్రిక్ కోసం ప్రాణాలకు తెగించి వాగులో వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి

**సీలేరు, జూలై 14:** మండలంలోని బత్తునూరు వాగుపై వంతెన నిర్మించాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ వాగు పొంగి ప్రవహిస్తున్నదని, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగులో నుంచి రాకపోకలను సాగిస్తున్నామని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు కురిసిన ప్రతీసారి ఈ సమస్య ఉత్పన్నమవుతున్నదని, దీంతో పంచాయతీలోని పాతునిగుంట, బత్తునూరు, నేతమర్రి, బుగ్గిరాయి, మైనకోట తదితం గ్రామాల ప్రజలు ప్రాణాలకు తెగించి ఈ వాగును దాటి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తున్నదని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.